కథ

# పంజరం

డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

మాధవి ఇంటి ముందు టాక్సీ దిగే సరికి ఇంటి తలుపు తాళం వేస్తూ కనిపించాడు మోహన్.

కారు ఆగిన చప్పుడు విని తలతిప్పి చూసాడు మోహన్. పాపకు కాస్త ఒళ్ళు వెచ్చబడింది. మందు వేయమని చెప్పాను శారదగారికి. క్రెష్‌లో వేరే పిల్లలకు జ్వరం సోకుతుందేమో అని సందేహపడిందావిడ. వీలయితే వెళ్ళి పాపను తీసుకొచ్చుకో. రెస్టు తీసుకో... వస్తానూ గబగబా చెప్పేసి స్కూటర్ స్టార్ట్ చేసుకుని బయల్దేరాడు మోహన్.

నీరసంగా లోపలికి వచ్చింది మాధవి. ఫ్రిజ్‌లో నుండి మంచినీళ్ళు తీసుకుని తాగింది. వెంటనే వెళ్ళి పాపను తెచ్చేసుకుందామని గుమ్మందాకా వచ్చిన మాధవికి రాత్రి తొమ్మిది నుండి ఉదయం ఎనిమిదింటి దాకా పని చేసిన శరీరం, మనసు సహకరించలేదు. నీరసంగా అనిపించి కుర్చీలో కూర్చుండిపోయింది.

కాసేపు నిద్రపోయి లేస్తే తప్ప పాపను చూసుకునే ఓపిక వుండదు అనుకుంటూ క్రెష్‌కి ఫోన్ చేసింది. శారద ఫోను తీసింది.

నేను మాధవిని మాట్లాడుతున్నానండి. పాప ఎలా వుంది? ఏడుస్తోందా? టెంపరేచర్ ఎక్కువగా వుందా? అనడిగింది మాధవి.

కంగారు పడాల్సినదేం లేదండి. నిద్రపోతోంది. గంట తరువాత మందు వేయమన్నారు అంది శారద.

కాస్త రిలీఫ్‌గా అనిపించింది మాధవికి.

సరేనండీ. సాయంత్రం తొందరగా వచ్చి తీసుకువెళ్తాను అని చెప్పి ఫోన్ పెట్టేసింది మాధవి.

పడకగదిలోకి వెళ్ళి డ్రెస్ మార్చుకుంది. డ్రెస్సింగ్ టేబుల్ మీద చిన్న కాగితం మడత కనబడింది.

సాంబారు, కూర ఫ్రిజ్‌లో వున్నాయి. మైక్రోవేవ్ ఓవెన్‌లో వెచ్చచేసుకుని తినేసి పడుకో. అన్నం తినకుండా నిద్రపోవద్దు మోహన్ అక్షరాలు పొందికగా వున్నాయి.

రాత్రికి పగలుకి సరిపడా సాయంత్రమే వండేస్తుంది. చద్దివంట అనుకోకుండా అదే కారియర్‌లో పెట్టి తీసుకువెడతాడు మోహన్.

మూడేళ్ళ పావనిని నిద్రలేపి, పళ్ళుతోమి, బట్టలు మార్చి, టిఫిన్ పెట్టి తీసుకెళ్ళి క్రెష్‌లో వదిలే డ్యూటీ మోహన్‌దే. ఏ రోజూ విసుక్కోడు పాపం.

మొగుడి మీద ప్రేమతో మాధవి ముఖంలో నవ్వు తొంగి చూసింది.

అతనికి పగలంతా ఆఫీసులో సరిపోతుంది. తన ఉద్యోగం వేళలో విచిత్రమైనది. రాత్రి తొమ్మిదింటికి మొదలవుతుంది తన పని.

కాలిఫోర్నియాలో అప్పుడు పగలు ఎనిమిదవుతుందేమో! అమెరికాలో వెస్ట్‌కోస్ట్‌లోని కాలిఫోర్నియా వాసులకు సంబంధించిన బ్యాంకు విషయాలు, ఆఫీసు వివరాలు, మెడికల్ సలహాలు ఒకటేమిటి అన్ని రకాల ఎంక్వైరీలు ఇండియాకు డైవర్ట్ చేయబడతాయి. ఆయా వివరాలు ముందుగానే కంప్యూటర్‌లో వుంటాయి. కనుక అడిగిన వారందరికీ సమాధానం చెప్పగలుగుతారు.

అమెరికాలో లేబర్‌కి ఖర్చు ఎక్కువ. మాల్స్‌లో పని చేసే హెల్పర్స్‌కి కూడా గంటకు ఎనిమిది లేక పది డాలర్లు ఇస్తారు. వాల్‌మార్ట్, మేసీ, జె.సి.పెన్ని వంటి మాల్స్‌లో భర్త వెంట అమెరికా వెళ్ళిన ఇండియన్ గృహిణులు పని చేస్తార్ట.

అక్కడి పనివారికి ఇచ్చే దానిలో పదవ వంతో ఇంకా తక్కువో ఇండియాలో వర్కర్స్‌కి ఇచ్చి పని జరిపించుకుంటూ ఖర్చు తగ్గించుకుంటున్నారు అమెరికన్లు.

అలాటి ఉద్యోగావకాశాలు రాబట్టి తనవంటి మామూలు గ్రాడ్యుయేట్ కూడా వేలలో జీతం కళ్లజూడగలుగుతోంది.

కానీ భర్తతో పిల్లలో గడిపేందుకు సమయం దొరకడం లేదు. పరుగులు ఉరుకులుగా జీవితం సాగుతోంది.

ఆలోచనలో పడిన మాధవి స్నానం ముగించి వచ్చి చల్లగా వున్న పదార్థాలే ఏదో తిన్నాననిపించి భోజనం ముగించింది.

అప్పుడే టైము పదకొండయ్యింది. కనీసం నాలుగు గంటలపాటు నిద్ర పోకపోతే మళ్ళీ రాత్రంతా మేలుకుని ఏది చేయడం అసాధ్యం. ఈ టైములో నిద్ర రమ్మంటే ఎలా వస్తుంది? విసుగ్గా అనుకుని బ్యాగ్ తెరచి మాత్ర తీసుకుని వేసుకుని పడుకుంది మాధవి.

పది నిముషాలలో మళ్ళీ లేచి కూర్చుంది. పాపకెలా వుందో? శారదగారు మందు వేసిందో లేదో... పోనీ వెళ్ళి పాపను తెచ్చేసుకుంటే.. ఆలోచనలు సాగుతుండగానే యాంత్రికంగా ఫోను చేసింది క్రెష్‌కు.

శారద లైన్‌లోకి రాగానే

పాపకు మందు వేసారా? అనడిగింది ఆదుర్దాగా.

వేస్తానని చెప్పాను కదా శారద గొంతులో కొద్దిగా అసహనం.

సారీ.. ఒళ్ళు ఇంకా వేడిగానే వుందా? ఏడవడంలేదు కదూ? నెమ్మదిగా అడిగింది.

పోనీ మీరొచ్చి తీసుకువెళ్తానంటే మీ ఇష్టం అంటూ ఫోన్ పెట్టేసిందావిడ.

మాధవి కాల్ సెంటరులో పనిచేస్తున్నదనీ, రాత్రి తెల్లవారేదాకా డ్యూటీలో వుంటుందనీ, పగలు కాసేపు నిద్రపోతే తప్ప విధి నిర్వహణ అసాధ్యమనీ శారదకు తెలుసు. ఎప్పుడయినా పిల్లను ఎక్కువసేపు అక్కడ వుంచితే అదనంగా డబ్బు చెల్లిస్తుంది మాధవి.

అయినా తన అసహాయత, అవసరం తెలుసు గనుకనే శారద అలా మాట్లాడగలిగింది అనుకుంటే మాధవి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

కళ్ళు మండుతుంటే ఐస్ నీళ్ళలో రుమాలు తడిపి కళ్ళమీద వేసుకుని పడుకుని నిద్రపోయింది మాధవి.

అలా అయిదు గంటలదాకా నిద్రపోతూనే వుంది. సాయంత్రం తొందరగా పని ముగించుకుని ఇంటికి వస్తూ శారదకు ఫోన్ చేసి పాపని మాధవి తీసుకెళ్ళిందాండీ? అని అడిగాడు మోహన్.

తొందరగా వచ్చి తీసుకెళ్తానని అన్నారేగానీ ఇంతదాకా రాలేదు అన్నదావిడ.

పాపని తీసుకుని ఇంటికి వచ్చిన మోహన్ కాలింగ్‌బెల్ నొక్కినా మాధవి పలక్కపోవడంతో సెల్‌ఫోన్ నుండి ఇంటి ఫోనుకు రింగ్ చేసాడు.

హలో.. మాడీ స్పీకింగ్.. వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ? తటాలున లేచి కూర్చున్న మాధవి అలవాటుగా ఏ యాసాలేని న్యూట్రల్ టోన్‌లో పలికింది.

క్షణం తరువాత తెలిసిందామెకు తను ఆఫీసులో లేననీ, తన బెడ్‌రూములో ఫోను మోగుతున్నదనీ.

ఫోన్‌లో విసుగ్గా వినబడింది మోహన్ గొంతు తలుపు తీస్తావా ప్లీజ్.. పాపను ఎత్తుకుని గుమ్మం ముందు పది నిముషాలుగా నిలబడి వున్నాను అని.



ఉలిక్కిపడి ఫోను పెట్టేసి పరిగెత్తి వెళ్ళి తలుపుతీసింది మాధవి. ఎలా వుంది పాపకు? అంటూ పావనిని చేతల్లోకి తీసుకుంది.

నువ్వు మధ్యాహ్నమే వెళ్ళి పాపను పిల్చుకుని వచ్చి వుంటావనుకున్నాను లోపలికి వెళ్తూ అన్నాడు మోహన్. ఎప్పుడూ లేనిది అతని గొంతులో నిష్టూరం ధ్వనించింది.

మాధవి కళ్ళలో నీళ్లు తిరిగాయి.

వెళ్ళాలనే అనుకున్నాను. కానీ రాత్రంతా మేలుకుని, పది గంటలు పనిచేసిన శరీరానికి విశ్రాంతి అవసరమని మనసు శరీరం మొండికేసాయి. నిద్ర లేకపోతే డ్యూటీ చెయ్యలేను. అన్ని వేల రూపాయల జీతం... వదులుకుంటే ఇంత విలాసవంతమైన, సౌకర్యమైన జీవితం ఎలా వస్తుంది? తనూ అంతే నిష్ఠూరంగా అనేసి వంటింట్లోకి నడిచింది పాపకి పాలు తేవడానికి.

ఆ మాటలతో మోహన్ పురుషాహంకారం దెబ్బతింది. మిమ్మల్నిద్దరినీ నేను పోషించగలను అనేసి పడకగదిలోకి వెళ్ళిపోయాడు.

పాపకు జ్వరం తగ్గి కులాసాగా వుండటంతో పాలు త్రాగి ఆటలో పడింది.

కాఫీ కలిపి మోహన్‌కి అందించి గబగబా వంట చేయడం ప్రారంభించింది మాధవి.

వంట పూర్తిచేసి, అన్నీ డైనింగ్ టేబులు మీద సర్దేసి స్నానానికి వెళ్ళింది.

లోపలి దుస్తుల మీద పల్చని నైటీ వేసుకుని వచ్చి అద్దం ముందు నిలబడి అబ్‌సెషన్ స్ప్రే వేసుకుంటుంటే వెనకగా వచ్చి ఆమె నడుము చుట్టూ చేతులు చుట్టి మెడమీద ముఖం ఆన్చి సారీరా! పాపకు బాగాలేదన్న కారణంగా కాస్త చిరాకు పడ్డాను అన్నాడు మోహన్.

సరే భోజనానికి పదండి అంది దూరంగా జరుగుతూ.

మోహన్ ముఖం ముడుచుకున్నాడు.

భోజనం కాగానే వెళ్ళడానికి తయారవ్వాలి. అంతలో టాక్సీ వస్తుంది. అంతేగా.. అన్నాడు నిస్పృహగా.

శనివారం, ఆదివారం తప్ప అంతే మరి అంది మాధవి డైనింగ్ రూములోకి నడుస్తూ.

ముందు పాపకు మెత్తగా కలిపిన చారు అన్నం, కాస్త పాలు అన్నం తినిపించింది. అంతసేపూ టి.వి. చూస్తూ కూర్చున్న మోహన్ చూపులు వుండి వుండి మాధవి మీద వాలుతూనే వున్నాయి.

గమనించినా ఏమీ ఎరుగనట్టు వెళ్ళి చేతులు కడుక్కుని వచ్చి పాపకు మూతి తుడిచి ముద్దుపెట్టి, బొమ్మల ముందు కూర్చోబెట్టి తామిద్దరికీ వడ్డించింది.

అప్పటికే టైము ఎనిమిదిన్నర కావొస్తుండంతో తొందరగా భోజనం ముగించి డ్రెస్సప్ అవసాగింది.

వీధిలో టాక్సీ వచ్చి నిలబడగానే పావని ఏడుపు మొదలుపెట్టింది ఆఫీసు వద్దు... మమ్మీ కావాలి అంటూ.


నీకు కథ చెప్తాను కదా! మంచి పిల్లలా అమ్మకు టా టా చెప్పేయి మరి అంటూ కూతుర్ని ఎత్తుకుని సముదాయిస్తున్నాడు మోహన్.

నిస్సహాయురాలిలా వాళ్ళిద్దరి వైపూ చూసి, చెప్పులు తొడుక్కుని బండి ఎక్కింది మాధవి.


రాత్రి పదింటి నుండి ఉదయం ఎనిమిది గంటల దాకా ఆమె మాధవి కాదు. మ్యాడీ. తనది కాని భాష మాట్లాడుతూ, తనది కాని పేరుతో పిలిపించుకుని పలకుతూ, ముక్కుమొహం తెలియని పరాయి దేశం వారి ప్రశ్నలకు సమస్యలకు సమాధానాలిస్తూ, మధ్య మధ్యలో ఆడమొగ భేదం లేకుండా భుజాలు చరిచి మాట్లాడే తోటి ఉద్యోగులతో కలిసిపోతూ మరో మనిషిగా బ్రతికేస్తుంది.

ఈ రెండు పాత్రలలో ఏది నిజం ఏది నటన అనేది ఒక్కొక్కసారి ఆమెకే గందరగోళంగా అనిపిస్తుంది. రెండు మైళ్ళ అవతల మరో ఉద్యోగిని టాక్సీలో ఎక్కేదాకా సీటు అంచుమీద టెన్స్‌గా కూర్చుంది మాధవి.

ఏం సాధిస్తోంది తను? తామిద్దరికీ ఏకాంతం కావాలన్నా వారాంతం సెలవులకోసం ఎదురు చూడాల్సిందే.. ఆ రెండు రోజులూ ఇంటికి కావల్సిన వస్తువులు తెచ్చుకోవడం,



పాపను చేరదీయడం, ఒకే ఇంట్లో వుంటూ కూడా రోజుకు నాలుగైదు గంటలకన్న కలిసి గడపలేని అసంతృప్తిని పూడ్చుకోవడం కోసమా అన్నట్టు దొరికిన సామీప్యతను వాడుకోవాలని తపన పడడంతో ఇట్టే గడిచిపోతాయి.




శ్రీవారిని వదిలిరావడం దిగులుగా వుందా? తమాషా చేసింది సహోద్యోగిని.

ష్... అంటూ డ్రైవర్ వున్నాడని గుర్తుచేసింది మాధవి. ఆఫీసులో అడుగుపెట్టగానే హాయ్ మ్యాడీ.. లుకింగ్ సెక్సీ యార్ అన్నాడో కొలీగ్.

నవ్వేసి తన క్యూబికల్‌లోకి వెళ్ళిపోయింది మాధవి.

ఈ శనివారం అందరికీ మజా.. గోల్కొండలో పార్టీ వుందట మధ్యలో వచ్చి ఉత్సాహంగా చెప్పిపోయింది మిస్ జేన్‌గా పిలవబడే జానకి.

ఇటువంటి వీకెండ్ పార్టీలు మాధవికి ప్రాణసంకటంగా వుంటాయి. నేను రాలేను అంటే వెట్ బ్లాంకెట్‌లాగా స్పాయిల్ స్పోర్ట్‌లాగా చూస్తారు. మోహన్ ప్రోత్సహించి పంపినా ఎంతో విలువైన ఆ రెండు రోజులలో ఒక రోజు తమకి కాకుండా పోవడం దిగులుగానే మిగుల్చుతుంది.

మర్నాడు గంట వస్తుందనగానే ఉదయం ఎనిమిదింటికల్లా ఇంటి ముందు టాక్సీ దిగింది మాధవి.

జ్వరం వచ్చి చలి పెడుతున్నట్టు దుప్పట్టాను తలమీదుగా తీసుకుని భుజాల చుట్టూ కప్పుకుని పరుగున లోపలికి వచ్చి పడింది.

అద్దం ముందు నిలబడి షేవ్ చేసుకుంటున్న మోహన్ మాధవి ముఖంలోకి చూసి మైగాడ్... ఏమైంది మాధవీ? అంటూ వచ్చి పొదివి పట్టుకున్నాడు.

పాలిపోయిన ముఖంతో, వణుకుతున్న పెదవులతో జబ్బుపడ్డదానిలా వుంది మాధవి.

మా రోజీని టాక్సీ డ్రైవర్ రేప్ చేసాట్ట. తనని హాస్పిటల్‌లో చేర్చారు. డ్రైవర్‌ని అరెస్టు చేసార్ట సగం ఏడుస్తూ చెప్పింది.

మాధవిని సోఫాలో కూర్చోబెట్టి, మంచినీళ్ళు తెచ్చి తాగించి ధైర్యం చెప్తున్నట్టుగా వీపుమీద రాస్తూ కూర్చున్నాడు మోహన్.

నిన్న మీరన్నారు కదా నేను మీ ఇద్దరినీ పోషించగలను అని... నిజంగానే అన్నారా? నేను ఈ ఉద్యోగం మానేస్తాను మోహన్ వణుకుతున్న గొంతుతో అంది మాధవి.

మోహన్ బదులు పలుకలేదు. నెమ్మదిగా లేచి వెళ్ళి మాధవి బ్యాగ్‌లో నుండి మాత్ర తీసుకువచ్చి ఆమెతో మింగించాడు. నువ్వు ముందు కాసేపు నిద్రపో అంటూ పడక గదిలోకి తీసుకువచ్చి పడుకోబెట్టాడు.

అతని కళ్ళలోకి తదేకంగా చూసి కళ్ళు మూసుకుంది మాధవి. మోహన్ కళ్ళలో రెపరెపలాడుతున్న బాధ, భయం, అసహాయత అమె మనసును తాకాయి.

ఫ్లాట్ కొనుక్కోవాలని అడ్వాన్స్‌గా రెండు లక్షలు కట్టారు. మిగతా ఎనిమిది లక్షలు ఒకటిన్నర సంవత్సరంలోపు కట్టాలి. లేకపోతే అడ్వాన్స్ వదులుకోవాలి. ఇంటికని కొన్న ఫర్నీచర్ లోన్ ఇంకా తీరలేదు. పాప పేరిట ఈ మధ్యనే పాలసీ తీసుకున్నారు. ఇవన్నీ తమిద్దరి సంపాదన పరిగణనలోకి తీసుకుని ధైర్యంగా తీసుకున్న ఆర్థిక నిర్ణయాలు.

తను ఉద్యోగం మానగలదా? ఒకవేళ మోహన్ పట్టుబట్టినా అలవాటైన ఆ జీవితాన్ని, ఆ జీతమిచ్చే భద్రతను వదలుకోగలదా?

ఆలోచనలతో అలసిపోయిన మాధవి చెంపలమీదుగా జారుతున్న కన్నీళ్ళను తుడుచుకునే ఓపిక లేనట్టు కళ్ళు మూసుకుని పడుకుంది.

పంజరం అలవాటైన చిలుక తలుపు తీసినా ఎగిరిపోలేదు.

○

## తమన్నాకి మంచిరోజులు

తొలిచిత్రం 'శ్రీ' పరాజయం చవిచూస్తే మలి చిత్రం 'జాదు' ఇంతదాకా విడుదల కాలేదు. ఇదే 'జాదు' తమిళంలో 'కేడి'గా రిలీజై ఫ్లాప్ అయింది. ఇప్పుడు 'హ్యాపీడేస్' సినిమాతో తొలిసారిగా విజయాన్ని చవిచూసింది తమన్నా భాటియా. అంతా కొత్తవాళ్లే నటించిన 'హ్యాపీడేస్'లో తమన్నాయే కాస్త పాత తార కింద లెక్క. ఈ చిత్రం ఘనవిజయంతో ఒక్కసారిగా అందరి దృష్టిలోకీ వచ్చిన తమన్నాకి ఇప్పుడు ఆఫర్లమీద ఆఫర్లు వచ్చిపడుతున్నాయట. అయితే కెరీర్‌ని జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటోంది తమన్నా. వెరీగుడ్!

